క్లుప్తంగా

ఎంపీ రేణుకాచౌదరిని కలిసిన నామా

ఖమ్మంవన్‌టౌన్: ఈనెల 15వ తేదీన జరగనున్న తన కుమారుడు భవ్యతేజ వివాహానికి హాజరుకావాలని ఎంపీ రేణుకాచౌదరికి ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆహ్వానపత్రిక అందజేశారు. హైదరాబాద్‌లో ఆమెను కలిసిన ఎంపీ వివాహ పత్రిక అందజేయడంతో పాటు రాజ్యసభకు ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

హస్నాబాద్‌లో బోనాల పండుగ



బోనాలతో మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

తిరుమలాయపాలెం: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో నాభిశిల ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మహిళలు ముత్యాలమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించగా.. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకే అత్యధిక సీట్లు

కామేపల్లి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు కైవసం చేసుకుంటుందని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భట్టు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భట్టు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని రాజేందర్ వివరించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ వెంకట్, గోపి, చందర్, జగదీశ్ తదితరులున్నారు.

నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని పాపాయిగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు రేపాకుల వీరస్వామి మంగళవారం ఆకస్మికంగా మృతి చెందడంతో పార్టీ నాయకులు నివాళులర్పించారు. వీరస్వామి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు తుశ్లూరు నాగేశ్వరరావు, దొండేటి ఆనందరావు, గోపోజు రవి, పప్పుల ప్రసాద్, పప్పుల ఉపేందర్, దొడ్డ లింగస్వామి, రామన బోయిన రవి, దొండేటి నిర్మల్‌రావు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా 'బండి'



బండి మాధవరావు

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మంగళవారం అన్నీ జిల్లాలకు సోషల్ మీడియా కోఆర్డినేటర్లను నియమించింది. ఈనేపథ్యాన ఖమ్మం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా బండి మాధవరావును నియమించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	గామీ
సాయిరాం	ఆపరేషన్ వాలంటైన్
ఆదిత్య	సైతాన్
శ్రీనివాస	భీమా
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	3
వంకాయ	36		20
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	40	చుక్కకూర	3
బీర	46		20
దొండ	26	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	30	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	25		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	70		20

-ఖమ్మం వ్యవసాయం



జల సంక్షోభం..

బుర్హాన్‌పురంలో నీటి కోసం నల్లా వద్ద క్యూ కట్టిన మహిళలు

గతేడాది కంటే పడిపోయిన నీటి మట్టం..

నగరంలో గతేడాదితో పోలిస్తే భూగర్భ జలాల నీటి మట్టం పడిపోయింది. భూగర్భ జల శాఖ అధికారులు ఖమ్మం నగర పాలకసంస్థ పరిధిలో కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసి బోర్లు, బావుల్లో నీటి మట్టం వివరాలను నమోదు చేస్తున్నారు. 2023 ఏడాది జనవరిలో 3.83 మీటర్ల లోతులో, ఫిబ్రవరిలో 4.50 మీటర్ల లోతులో జలమట్టం ఉండగా.. ఈ ఏడాది జనవరిలో 5.22 మీటర్లు, ఫిబ్రవరిలో 5.49 మీటర్ల లోతుకు జలమట్టం పడిపోయింది. ఇక మార్చిలో జలమట్టం మరింత లోతుకు పడిపోయే ప్రమాదం ఉందనే అంచనాల్లో అధికారులు ఉన్నారు.

నగరంలో అడుగంటుతున్న భూగర్భ జలాలు

- రోజురోజుకు పడిపోతున్న నీటి మట్టం
- మున్ముందు మరింత దిగజారే అవకాశం
- నీటి కోసం అల్లాడుతున్న జనాలు
- ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్న పలువురు
- వాడిన నీరంతా వృథాగా పోతున్న వైనం

ఖమ్మంమయూరిసెంటర్: వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యాన ఖమ్మం నగరంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఎండల తీవ్రత పెరగడం, చెరువుల్లో నీటి మట్టం తగ్గడం, కొన్ని నెలలుగా సాగర్ కాల్వల్లో నీరు సరఫరా లేకపోవడం, బోర్ల నుంచి రోజూ నీటిని తోడేస్తుండడం వెరసి నగరంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే బోర్లల్లో నీరు లభ్యమయ్యే పరిస్థితి లేకపోవడంతో నీటి కోసం జనం నానా అవస్థలు పడుతున్నారు. ఇక అపార్ట్‌మెంట్ల వాసులు, పలు కాలనీ వాసులు ట్రాక్టర్ల ద్వారా నీటి ట్యాంకర్లను తెప్పించుకుంటున్నారు. నెల రోజుల్లో నగరంలో భూగర్భ జలాలు వేగంగా పడిపోయాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మున్ముందు భూగర్భ జలాలు మరింత దిగజారే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు.

కొన్ని ప్రాంతాల్లో నీటిమట్టం లోతు (మీటర్లలో..)

ప్రాంతం	2023		2024	
	జనవరి	ఫిబ్రవరి	జనవరి	ఫిబ్రవరి
టేకులపల్లి	1.70	2.15	4.45	4.58
నిజాంపేట	0.40	1.70	3.05	3.45
శ్రీనివాస్‌నగర్	3.25	2.70	4.35	5.47
కవిరాజ్ నగర్	1.00	3.70	5.45	3.95
బ్యాంక్ కాలనీ	8.73	9.95	4.70	4.80
గ్రెయిన్ మార్కెట్	1.77	2.32	4.52	4.60
నాయుడుపేట	1.15	2.18	3.90	4.38
వైఎస్సార్ కాలనీ	11.70	10.15	14.35	15.80
రోటరీనగర్	7.30	8.00	4.55	4.75
కరుణగిరి	1.30	2.10	2.90	3.10
నగటు	3.83	4.50	5.22	5.49

తోడేస్తున్నారు తప్ప.. ఇంకించడం లేదు...

నగరంలో గృహ, ఇతర అవసరాలకు భూగర్భం నుంచి జలాలను బోర్ల ద్వారా తోడేస్తున్నారు. వేలాది బోర్లతో నీటిని తోడుతున్న ప్రజలు భూమిలోకి నీటిని ఇంకించడం మాత్రం చేయడం లేదు. ఇంకుడు గుంతలను వినియోగించకపోవడంతో పునర్వినియోగ నీరంతా మురుగు కాల్వల్లో కలిసిపోతుంది. వినియోగించిన నీరు అంతా మురుగు కాల్వల ద్వారా వృథాగా బయటకు పోతుండడంతో ఎక్కడా నీరు ఇంకే పరిస్థితి లేదు.

మరోసారి మోదీ ప్రభుత్వాన్ని తీసుకురావాలి



ఖమ్మం మామిళ్లగూడెం: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న గల్లా సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: కేంద్రంలో మరోసారి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని తీసుకొచ్చేందుకు పార్టీ కార్యకర్తలకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. మంగళవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మహాసభకు ఖమ్మం జిల్లా నుంచి పెద్ద ఎత్తున బస్సుల్లో బయలుదేరారు. దీనికి గల్లా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గల్లా మాట్లాడుతూ తెలంగాణలో 12 ఎంపీ సీట్ల గెలవాలనే లక్ష్యంతో బీజేపీ పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరావు, చావా కిరణ్, శ్యాం రాథోడ్, అల్లిక అంజయ్య, మంద సరస్వతి, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, కోటేశ్వరావు, వీరంరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, మండల అధ్యక్షుడు కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, మీగడ గోపి, షర్ఫుద్దీన్, సయ్యద్ మెహినుద్దీన్, కందరబోయిన వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

నియోగి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక



కోసూరు ప్రసాద్



గెంటేల శ్రీనివాసరావు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నియోగి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని నగరంలోని మామిళ్లగూడెంలో ఉన్న సంఘం కార్యాలయంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మంత్రప్రగడ జగన్మోహన్‌రావు, అధ్యక్షుడిగా కోసూరి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లికార్జునశర్మ, ప్రధాన కార్యదర్శిగా గెంటేల శ్రీనివాసరావు, కోశాధికారిగా నామవరపు రమేశ్, సహాయ కార్యదర్శులుగా చకిలం జనార్దన్‌రావు, ఈశ్వర్రగడ రామారావు, నిర్వహణ కార్యదర్శిగా మునుగోటి సంపత్, కార్యవర్గ సభ్యులుగా నిడుమోలు వీరభద్రం, వట్టిపల్లి రాజ్యలక్ష్మి, లింగంకుంట భాగ్యలక్ష్మిలు నియమితులయ్యారు. ఈ ఎన్నికలను బసవరాజు ఉపేంద్ర, మాటూరి లక్ష్మీనారాయణ, మంత్రప్రగడ జగన్మోహన్‌రావులు నిర్వహించారు.

అంకమ్మ ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న రవికుమార్

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి పలువురు దాతలు మంగళవారం విరాళాలు సమర్పించారు. నవీన గ్రానైట్స్ యజమానులు వేముల రవికుమార్–వాణి దంపతులు రూ.50,116 లు, కొండపర్తి నారాయణ, నాగేశ్వరి దంపతులు రూ.25,116 లు, వల్లభనేని శ్రీనివాసరావు, సీతామలక్ష్మి దంపతులు రూ.5,116లు, కార్పొరేటర్ మోతారపు శ్రావణి, సుధాకర్ దంపతులు రూ.10 వేలు విరాళంగా అందించారు. అంతేకాక గొడుగు నాగేశ్వరరాలు, వెంకటలక్ష్మి దంపతులు రూ10,116లు, తూము శేషయ్య, సునిత దంపతులు రూ.10,116లను అందించినట్లు దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



కూసుమంచి: గట్టుసింగారంలో ఆర్థిక సాయం అందిస్తున్న ప్రసాద్‌రెడ్డి

తిరుమలాయపాలెం/కూసుమంచి: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు శుభకార్యాలకు, కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. తిరుమలాయపాలెం హస్నాబాద్ గ్రామంలో తిరుపతమ్మ గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కూసుమంచిలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి ప్రసాదరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాశివరాత్రి రోజున జక్కేపల్లి జాతరలో సాంబారు గిన్నెలో పడి తీవ్రంగా గాయపడగా బాలుడిని పరామర్శించారు. అనంతరం పలు సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసేలా పాలన సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ బెల్లం శ్రీను, ఎంపీపీ మంగీలాల్, మాజా ఎంపీపీ జూకూరి గోపాలరావు, మాజీ ఎంపీటీసీ కొమిరెల్లి అంలింగగోవిందరెడ్డిల తో పాటు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, అరవిందరెడ్డి గంధ్ర గోపాలరావు, జడల నగేష్‌గౌడ్, గూడూరి ఉపేందర్, నరేందర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఖాదర్ బాబు, వెల్లంపల్లి లక్ష్మీకాంతమ్మ, మంకెన వాసు, ఇందుర్తి వెంకటరెడ్డి,కాంతారావు,రమేష్‌రెడ్డి,నెల్లూరి వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. గ్రామంలోని శ్మశానవాటికను గతంలో కొంతమంది ఆక్రమించుకున్నారు. ఈ విషయంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గ్రామస్తులు ఫిర్యాదు చేయగా.. మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం నివేదికను జిల్లా అధికారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లికి చెందిన కె.రాజేశ్ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. కాగా, ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు..

నేలకొండపల్లికి చెందిన నాగరాజు, అర్జున్ మంగళవారం రాత్రి బైక్‌పై చెరువుమాధారం వెళ్తుండగా, గ్రామ శివార్లలో నడుస్తూ వెళ్తున్న పరిటాల గోవింద్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో గోవింద్‌తో పాటు బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలు కాగా నేలకొండపల్లి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గోవింద్‌ను ఖమ్మం తరలించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ గ్రామంలో రూ.15 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు వాంకుడోత్ దీప్లా నాయక్, కాంగ్రెస్ నాయకులు భూక్యా బద్రునాయక్, దంతబోయిన శీను, భూక్యలింగా నాయక్, షేక్ లాల్‌జానీ, రసూల్, మేరా, గుండేటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

ఖమ్మంవన్‌టౌన్: మున్నూరు కాపులు చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్న కార్పొరేషన్ ఏర్పాటుపై కాంగ్రెస్ నాయకుడు, మున్నూరు కాపు సంఘం బాధ్యుడు శెట్టి రంగారావు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీలపై కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంతో బీసీలందరూ ఉన్నతంగా ఎదుగుతారని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల్లో సీసీ, బయోమెట్రిక్ పెట్టొద్దు..



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణు, కల్యాణం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒక పూట బడితో పాటు మే అంతా టీచర్లు, హెల్పర్లకు సెలవులు ఇవ్వాలని, 24 రోజుల సమ్మె హామీలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీల్లో పోషకాహారం దుర్వినియోగం కాకుండా సీసీలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని అధికారులను ఆదేశించడం సబబు కాదని, సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంతో పాటు సమ్మె హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐసీడీఎస్ అధికారికి అందజేశారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.రమ్య, కె.సుధరాధ, రాష్ట్ర నాయకుడు బి.కోటేశ్వరి, జిల్లా నాయకులు నాగమణి, విజయలక్ష్మి, పాపారాణి, నిర్మల, నాగమణి, రమా, స్వరాజ్యం, సీఐటీయూ నాయకులు పి.మోహన్‌రావు, తిరుమలచారీ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో గల డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ తెలిపారు. మంగళవారం ఆమె పోలేపల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి ఎంపీడీఓకు వినతిపత్రాన్ని సమర్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. నాలుగు బ్లాకులకు కలిపి ఒక సెప్టిక్ ట్యాంక్ నిర్మించడం వల్ల సెప్టిక్ ట్యాంక్‌లో నీరు బయటకు పోయే అవకాశం లేక దుర్వాసన వస్తుందని, తక్షణమే సంబంధిత అధికారులు కల్పించుకొని కాలనీ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాసికమన్, ఉపేందర్, వెంకటరమణ, గోపాలకృష్ణ, మమత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ



మాట్లాడుతున్న డీసీపీ ప్రసాద్‌రావు

నేలకొండపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఖమ్మం డీసీపీ (లాఅండ్‌ఆర్డర్) జి.ప్రసాద్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన తొలిసారి నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరంఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోడీసీపీ మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెట్రోలింగ్‌ను విస్తృత పరచాలని ఆదేశించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంవన్‌టౌన్: మహిళలు చట్టాలు, హక్కులపై సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ, ట్రైనీ ఐపీఎస్ మౌనికలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలపై ఎలాంటి వివక్ష చూపవద్దన్నారు. తొలుత కేజీబీవీలు, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్ల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం డ్రాయింగ్, రంగోలి, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 40 మంది ఉత్తమ మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ వేడుకలలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, జిల్లా బాలల పరిరక్షణ సమితి అధ్యక్షురాలు భారతీరాణి, జిల్లా సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సఖీ కేంద్ర సిబ్బంది, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సిబ్బంది, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

'త్రివేణి' విద్యార్థినికి అభినందన

ఖమ్మం సహకారనగర్: భారతీయ తపాలా శాఖ నిర్వహించిన దాయ్ ఆకార్ లెటర్ రైటింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా తమ పాఠశాల విద్యార్థిని బి.ఆరాధ్య ఎన్వోలెప్ లెటర్ విభాగంలో ఖమ్మం నుంచి ప్రథమ బహుమతి సాధించినట్లు త్రివేణి పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించిన సందర్భంగా ఆయన మా ట్లాడారు. కాగా, విద్యార్థినికి రూ.25వేల నగదు, ప్రశంసాపత్రం అందుకున్నట్లు ప్రిన్సి పాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల బాధ్యులు మురళీకృష్ణ, స్వప్న, ముస్తాఫా, అశోక్, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కూసుమంచి/రఘునాథపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం/కామేపల్లి: పదో తరగతి విద్యార్థులకు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన పలువురు నాయకులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈనేపథ్యాన కూసుమంచి మండలం మల్లేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూసుమంచిలోని జలగం వెంగళరావు జూనియర్ కళాశాల అధ్యాపక బృందం పరీక్ష ప్యాడ్లు, ఇతర సామగ్రిని అందించింది. అలాగే రఘునాథపాలెం మండలం వీవీపాలెం జిల్లా పరిషత ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంస్థ ఉపాధ్యక్షుడు ఏనుగు శివరాఘవ పరీక్ష సామగ్రి అందించగా.. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఖమ్మం గుట్టల బజార్‌లోని మౌంట్‌ఫోర్ట్ స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌తో పాటు ఇతర సామగ్రి అందజేశారు. అంతేకాక కామేపల్లి మండలం కొమ్మినేపల్లి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించగా.. 2017–18 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థి బొమ్మగాని హరీశ్ జ్ఞాపకార్థం అతడి స్నేహితులు విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సంస్థల బాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి: విద్యార్థినికి పరీక్ష ప్యాడ్ అందజేస్తున్న అధ్యాపకులు



రఘునాథపాలెం: పరీక్ష సామగ్రి అందజేస్తున్న అధ్యాపకులు